క్లుప్తంగా

సురక్షతో మెరుగైన వైద్యం



గోనెగండ్లలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల: ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని ఈఓఆర్డీ నాగేష్ తెలిపారు. మంగళవారం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. సురక్ష శిబిరంలో వైద్యులు మనోజ్, ప్రణీత్, విజయ్ 360 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ సతీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: పోనకలదిన్నె గ్రామంలో 310 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పత్తికొండ రూరల్: స్థానిక సచివాలయం-5లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ నారాయణ దాస్, ఎంపీడీఓ కవిత పర్యవేక్షించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య సేవలందించారు.

దేవనకొండ: పల్లెదొడ్డి గ్రామంలో 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు వైద్యులు విజయభాస్కర్, విజయ్‌కుమార్, అలేఖ్య తెలిపారు.

కృష్ణగిరి: పోతుగల్లు గ్రామంలో వైద్య శిబిరంలో 361 మందికి సేవలందించినట్లు ఈఓఆర్డీ మురళీ మోహన్, వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు.

చిప్పగిరి: నంచర్ల గ్రామంలో వైద్యులు ఓపీ ద్వారా 342 మందికి వైద్యసేవలందించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్దికెర: ఎం.అగ్రహారం గ్రామంలో ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించి ప్రజలకు వైద్య సేవలందించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించండి

ఆలూరు రూరల్: నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చూడాలని ఆలూరు అసెంబ్లీ అసిస్టెంట్ ఎన్నికల అధికారి రామాంజనేయులు సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం అయ్యారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. వీల్ చైర్లు, ర్యాంపులు ఉండేలా చూడాలన్నారు. బీఎల్ఓలు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎలాంటి మౌలిక వసతులు కల్పించాలో ఆర్వోకు నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే 80 ఏళ్ల పైబడిన ఓటర్లు గుర్తించాలన్నారు. వికలాంగుల, వీఐపీ ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల వారీగా సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల డీటీ గుండాల్‌నాయక్, సీనియర్ అధికారి బసవన్న గౌడ్, బీఎల్ఓలు ఉన్నారు.

ప్రహరీ నిర్మాణానికి విరాళం



రూ.50 వేలు విరాళం అందిస్తున్న బుసినె విరుపాక్షి

చిప్పగిరి: స్థానిక భంభం స్వామి దర్గా సమీపంలోని మస్లిం స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి మంగళవారం రూ.50 వేలు విరాళం అందించారు. తమ అభ్యర్థనపై వెంటనే స్పందించి సాయం అందించడంపై మత పెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మండలంలోని డేగులహాలు గ్రామంలో ఇటీవల రైతు నాగిరెడ్డికి చెందిన గడ్డివాము మంటల్లో కాలిబూడిద కావడంతో ఆయనకు విరూపాక్షి, మండల కన్వీనర్ మారయ్య చెరో రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నందవరం: గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని ఆ పార్టీ నాయకులు నరహరిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హాలహర్వి గ్రామ పంచాయతీ పరిధిలోని హెచ్.బాపురంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. 'గడప గడపకు మన ప్రభుత్వం' రెండవ విడతలో మంజూరైన నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతునట్లు వివరించారు. రూ.5 లక్షలు చొప్పున రెండు చోట్ల సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. నాయకులు తిమ్మప్ప, కోతి ఈరన్న, మద్దిలేటి, రాఘవేంద్ర, నరసరాజు, ఎల్లారెడ్డి, చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీసు అధికారులకు సన్మానం

పత్తికొండ రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న పోలీసు అధికారులను మంగళవారం కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, టౌన్ సీఐ మురళీమోహన్, తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున, ఎస్బీ కానిస్టేబుల్ వీరేంద్రలకు శాలువా వేసి, డైరీలు అందించి అభినందించారు. పోలీసు సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు పక్కా ఆస్తి



హత్తిబెళగల్ జగనన్న కాలనీలో నిర్మించిన ఇల్లు

- జగనన్న కాలనీల్లోని ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్
- పేదలకు సర్వ హక్కులతో రూ.లక్షల విలువైన ఆస్తి
- సచివాలయాల్లో ప్రారంభం కానున్న ప్రక్రియ
- నియోజకవర్గంలో 71 లేఅవుట్లు, 14,159 మంది లబ్ధిదారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామంలో జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ఆలూరు రూరల్: రాష్ట్రంలో పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్థలాలు ఇచ్చి గృహ నిర్మాణానికి ప్రోత్సాహం అందిస్తున్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఇళ్ల స్థలాలు ఇచ్చి చరిత్రాత్మక అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. తాజాగా జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుండగా ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఇదే కదా అభివృద్ధి

నియోజకవర్గంలో 14,159 మందికి లబ్ధి

నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 71 లేఅవుట్లలో 14,159 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. అలాగే మరో రూ.35 వేల డ్వాక్రా రుణాన్ని మంజూరు చేసింది. రాయితీపై ఐరన్, సిమెంటుతో పాటు ఉచితంగా ఇసుక అందిస్తోంది. అలాగే జగనన్న కాలనీల్లో లక్షలాది రూపాయలతో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం కల్పిస్తోంది. దీంతో కాలనీల్లో ఇల్లు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు విలువ చేస్తాయని అంచనా.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్

జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వచ్చే నెల 9 లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే వీఆర్వోలు, కార్యదర్శులకు శిక్షణ పూర్తి చేసింది. నియోజకవర్గంలో 96 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రభుత్వం తరఫున వీఆర్వో లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయనుండగా..కార్యదర్శి జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కన్వేయన్స్ డీడ్‌లో తప్పులు లేకుండా నిర్ణీత గడువులోగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేలా లబ్ధిదారుల ప్లాటు నంబర్, సరిహద్దులు ఆన్‌లైన్‌లో పొందపరిచారు.

ప్రయోజనం ఇలా..

- స్థలం రిజిస్ట్రేషన్ ద్వారా ఇంటిపై లబ్ధిదారులకు సర్వహక్కులు సంక్రమిస్తాయి.

నాడు – గత ప్రభుత్వాలు ఇళ్ల లబ్ధిదారులకు డి-పట్టాలు ఇచ్చేవి. గృహ నిర్మాణ రుణం కోసం ఆ పట్టాలను హౌసింగ్ కార్పొరేషన్‌కు తాకట్టు పెట్టేవి. లబ్ధిదారులకు ఎలాంటి హక్కులూ ఉండేవి కాదు. రూపాయి అప్పు పుట్టేది కాదు. రిజిస్ట్రేషన్‌కు వీలులేక అత్యవసర పరిస్థితుల్లో తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి.

నేడు – వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పదేళ్ల తర్వాత ఇంటిపై సర్వహక్కులు ఉండేలా లబ్ధిదారుల పేరిట స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్‌ను అందజేయనుంది. అందుకోసం అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించింది. పదేళ్ల తర్వాత ఇవి సేల్ డీడ్‌లుగా మారుతాయి. తద్వారా లబ్ధిదారులకు సదరు ఇంటిపై సర్వ హక్కులు సంక్రమిస్తాయి.

- ఇంటిని బ్యాంకులో తాకట్టు పెట్టి రుణసాయం పొందవచ్చు.
- ఇంటి విలువ పెరిగి కొనుగోలుకు డిమాండ్ ఏర్పడుతుంది.
- అత్యవసర సమయాల్లో ఇంటిని అమ్ముకునే వీలు ఉంటుంది.
- వారసులకు గిఫ్ట్ డీడ్ కింద ఇంటిని బదలాయించవచ్చు.

ఇంటిపై పూర్తి హక్కులు



ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కోసం అన్ని సిద్ధం చేశాం. ఆయా గ్రామ/వార్డు సచివాలయ పరిధిలో ఉన్న వారు అక్కడే రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. స్థలం రిజిస్ట్రేషన్‌తో ఇంటిపై లబ్ధిదారుడికి పూర్తి హక్కులు సంక్రమిస్తాయి. పేద వర్గాల వారికి ఎంతో మేలు జరుగుతుంది.

– రామాంజనేయులు, తహసీల్దార్, ఆలూరు

చాలా ఆనందంగా ఉంది



రెక్కాడితే డొక్కాడని కుటుంబం మాది. నా భర్త, ఇద్దరు పిల్లలతో 15 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఇంటి కోసం గతంలో చాలా సార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. వైఎస్ జగనన్న సీఎం అయిన తర్వాత ఇంటిస్థలంతో పాటు నిర్మాణానికి రూ.1.80 లక్షల సాయం, రూ.35 వేల డ్వాక్రా రుణం ఇవ్వడంతో మా సొంతింటి కల సాకారమైంది. ఇప్పుడు స్థలాన్ని నా పేరిట రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తారని అధికారులు చెప్పడంతో సంతోషంగా ఉంది.

– అరికెర లక్ష్మి, కురువళ్లి గ్రామం

గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల

నందవరం: మండలంలో 15 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.75,05,636 మంజూరైనట్లు ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య తెలిపారు. ఆయన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆయా గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య పనులు, విద్యుత్ బిల్లులు, పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచి నీటి సౌకర్యం, వీధి దీపాల నిర్వహణ తదితర పనులకు నిధులు వినియోగించుకోవాలన్నారు.

గ్రామ పంచాయతీల వారీగా విడుదలైన నిధులు ఇలా..

గురజాల రూ.3,15,200, హాలహర్వి రూ.9,23,686, ఇబ్రహీంపురం రూ.3,78,120, కనకవీడు రూ.6,51,169, కే.పేట రూ.1,88,925, మాచాపురం రూ.2,69,895, మిట్టసోమపురం రూ.1,92,748, ముగతి రూ.6,95,386, నదికైరవాడి రూ.2,59,388, నాగలదిన్నె రూ.7,31,293, మేజర్ పంచాయతీ నందవరం రూ.14,40,510, పెద్దకొత్తిలి రూ.4,35,891, పోనకలదిన్నె రూ.2,08,558, పూలచింత రూ.2,13,859, టి.సోమలగూడూరు రూ.6,01,008 నిధులు విడుదలైనట్లు వివరించారు. అలాగే మండల పరిషత్ నిధులు రూ.15,90,450 మంజూరయ్యాయన్నారు. ఈ నిధులను గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఉపయోగించుకోవచ్చన్నారు.

నిధుల స్వాహాపై విచారణ

గోనెగండ్ల: మండలంలోని ఆయా పాఠశాలకు 2023–24 విద్యా సంవత్సరంలో జగనన్న విద్యాకానుక కిట్లను సరఫరా చేసేందుకు కేటాయించిన నిధులను అప్పటి ఎంఈఓ వినోద్‌కుమార్ స్వాహా చేశారని ఆరోపణలు రావడంతో మంగళవారం ఆదోని డిప్యూటీ డీఈఓ వెంకటరమణ రెడ్డి గోనెగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీఆర్పీలు, ఉపాధ్యాయులను విచారించారు. జరిగిన విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఈఓ నిధులు స్వాహా చేసినట్లు పలు విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

పార్టీ విజయానికి కృషి



మాట్లాడుతున్న ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి

చిప్పగిరి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపించి మరోసారి వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం మండల కన్వీనర్ మారయ్య ఆధ్వర్యంలో చిప్పగిరిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కిందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మంచి జరిగి ఉంటేనే ఓటు వేయండి అని చెప్పే దమ్మున్న నాయకుడు జగన్ మాత్రమేనని కొనియాడారు. ఓటమి భయంతోనే టీడీపీ పొత్తులకు తెర లేపిందని, ఆ పార్టీకి ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేదని విమర్శించారు. సొసైటీ అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు, లోకనాథ్, ఓబులేష్, నాగప్ప, సేనాపతి, మల్లికార్జున, లాల్‌స్వామి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత గట్టు స్ట్రైకర్స్ జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో నిర్వహించిన వైఎస్‌ఆర్ అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీల్లో గట్టు స్ట్రైకర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆర్గనైజర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో విజేత జట్టుకు మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, రూరల్ సీఐ మోహన్‌రెడ్డితో కలిసి రూ.40,116 నగదు బహుమతి, ట్రోఫీని అందజేశారు. తరువాతి స్థానాల్లో నిలిచిన చెట్నపల్లె జట్టుకు రూ.30,116, కర్నూలు స్టేడియం జట్టుకు రూ.20,116, రాయచూరు జట్టుకు రూ.10,116 అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రియాజ్‌అహమ్మద్, బుట్టారంగయ్య, బాబుఖాన్, శ్రీనివాసరెడ్డి, యుకె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు రెండెకరాల భూమి విరాళం



వందవాగిలిలో దాతను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

హొళగుంద: మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు సంతెకూడ్లూరుకు చెందిన నాగలికెర విజయ్‌కుమార్ కుటుంబీకులు రెండెకరాల భూమిని మంగళవారం విరాళంగా అందజేశారు. గ్రామంలో 1 నుంచి 8వ తరగతి వరకు కన్నడ, తెలుగు మీడియం పాఠశాలలుండగా పైచదువులకు పాఠశాల స్థాయిని పెంచేందుకు భూమి కొరత ఉంది. దీంతో ఆ గ్రామ పెద్దలు హైస్కూల్ ఏర్పాటుకు భూమి కోసం ఆదోనిలో దళారి వ్యాపారం చేసుకుంటున్న నాగలికెర విజయ్‌కుమార్‌ను సంప్రదించారు. ఆయన స్పందించి తన భూమిలోని రెండెకరాలను పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారు. దీంతో మంగళవారం గ్రామపెద్దలు సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున, బోయ మేలగిరి, సత్యనారాయణరెడ్డి, బాణాపుర లక్ష్మీకాంతరెడ్డితో పాటు హెచ్ఎం శేషాద్రి, టీచర్లు దాతను ఘనంగా సత్కరించారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

ఆస్పరి: ఎన్నికల ప్రశాంత నిర్వహనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. మంగళవారం రాత్రి మండలంలోని వలగొండ గ్రామాన్ని డీఎస్పీ, ఆస్పరి సీఐ హనుమంతప్ప సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ.. అందరూ ఐకమత్యంగా జీవించాలన్నారు. పంతాలు, పట్టింపులకు పోకుండా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. గొడవలు, ఘర్షణల వల్ల కుటుంబాలు ఛిన్నాభిన్నవుతాయన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగితే 100 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. చట్టాలపై అవగాహన కల్పించారు.

వేలంపాటలో రూ.3.13లక్షల ఆదాయం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన రిజర్వాయర్‌లో చేపల పెంపకం హక్కులకు వేలంపాట మంగళవారం ముగిసింది. పందికోన గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి స్వాతి ఆధ్వర్యంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సి.చంద్రయ్య వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు రూ.3.13 లక్షలకు హక్కులను దక్కించుకున్నారు. వీరు జూలై నెల వరకు రిజర్వాయర్‌లో చేపల పెంపకం చేపట్టవచ్చని ఆయన తెలిపారు. ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ బాలరాజు, విలేజ్ ఫిషరీస్ అధికారిణి వసంత పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజాన్ని స్థాపిద్దాం



కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవి

ఆలూరు రూరల్: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి సూచించారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలో కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియా లెప్రి బ్యాక్టీరియా నుంచి వస్తుందన్నారు. రోగి తుమ్మడం, దగ్గడం వల్ల ఇతరులకు వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించేందుకు మూడు నుంచి ఐదేళ్లు పడుతుందని చెప్పారు. చర్మంపై స్పర్శలేని మచ్చ లు, ముఖం, చెవులపై నొప్పి లేని బుడిపెలు, చిటికెన వేలు, కాలి వేళ్లు రాసుకోవడం బొబ్బలు రావ డం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటే తప్పక నయం అవుతుందన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం, ఏఎన్ఎంలు యశోద, రుక్మిణి, సుజాత ఆశా కార్యకర్తలు ఉన్నారు.

అభివృద్ధి చేసి చూపిన వైఎస్సార్‌సీపీ



వెల్దుర్తిలో గ్రంథాలయ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రామాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకుని సౌకర్యాలు కల్పించి, అభివృద్ధి చేసి చూపిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. అధికారంలో ఉండగా టీడీపీ నాయకులు ఏనాడూ ప్రజల్లోకి వెళ్లలేదని, ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో జిమ్మిక్కులు చేసేందుకు వస్తున్న ఆ పార్టీ వారికి ప్రజలను ఓటు అడిగే హక్కే లేదని స్పష్టం చేశారు. మంగళవారం ఆమె వెల్దుర్తి మండల కేంద్రంలో రూ.82.40 లక్షల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డితో కలిసి ప్రారంభించారు. పత్తికొండలో ఓటమి తప్పదని గుర్తించి టీడీపీ నాయకుడు చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్, భార్య భువనేశ్వరి నియోజకవర్గానికి వచ్చి పాట్లు పడుతున్నారన్నారు. టీడీపీ జనసేన, వామపక్షాలతోనే గాకుండా ఎంతమందితో వచ్చినా ప్రజలు తమవైపే ఉన్నారని స్పష్టం చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఎంపీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, నాయకులు వెంకట్‌నాయుడు, గ్రంథాలయాధికారి కవితాబాయ్, బొమ్మన పెద్దిరెడ్డి, తేజేశ్వర రెడ్డి, ఆరిఫ్, పీఆర్ ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి, ఈఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- 1983లో అద్దె భవనంలో ఏర్పాటై సమస్యలతో సతమతమవుతున్న వెల్దుర్తి గ్రంథాలయం పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం నూతనంగా భవనాన్ని నిర్మించడంతో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, జిల్లా సెక్రటరీ ప్రకాశ్‌తో కలిసి ప్రారంభించారు. కర్నూలు రోడ్డులో సొసైటీ ప్రక్కన, రెడ్ క్రాస్ భవనం వెనుక 3 సెంట్ల స్థలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ నిధులు రూ.18 లక్షలతో ఏపీ ఈడబ్ల్యూడీసీ నిర్మించిన నూతన భవనం శిలాఫలకం ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేశారు. గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ తిరివీధి సాయి ప్రసాద్ మాట్లాడారు. డిప్యూటీ ఈఈ నాగరాజు, ఏఈ వెంకట్రామిరెడ్డి, కేపీ ఆచారి తదితరులు పాల్గొన్నారు.
- పట్టణంలోని 2వ వార్డులో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం-2 భవనం, 15వ వార్డులో రూ.20.80 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్-3 భవనాన్ని ఎమ్మెల్యే పంచాయతీ రాజ్ డీఈ శేషయ్యతో కలిసి ప్రారంభించారు. శిలాఫలకం ఆవిష్కరించి, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.


నేడు మున్సిపల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి

మద్దికెర: యాదవులు రాజకీయంగా ఎదిగి హక్కులు సాధించుకోవాలని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాస్‌యాదవ్, మండల నాయకులు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. వారు మంగళవారం మాట్లాడుతూ.. అధికార, ప్రతిపక్ష పార్టీలు యాదవులకు 5 ఎంపీ, 25 ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. యాదవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో కిట్టి, గోపాల్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి



నాయకంటి ఆంజనేయులు (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక నాయకంటి ఆంజనేయులు (27) మంగళవారం మృతి చెందాడు. వివరాలు.. మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామానికి చెందిన రఘు, సుశీలమ్మకు ముగ్గురు కుమారులు కాగా రెండవ కుమారుడు నాయకంటి ఆంజనేయులు (27) తిరుపతి సమీపంలోని రేణిగుంటలో ఓ ప్రైవేట్ హస్పిటల్లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి నాలుగేళ్ల క్రితం కోడుమూరు మండలం లద్దగిరికి చెందిన యువతితో వివాహం జరిగింది. కొద్దిరోజులకే భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావటంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. భార్యభర్తల కేసు కోర్టులో నడుస్తుంది. ఇదిలాఉండగా రేణిగుంటలో రెండు రోజుల క్రితం ఆంజనేయులు మత్తు ఇంజెక్షన్ అధిక డోసు తీసుకోవడంతో చుట్టుపక్కల వారు ఆస్పపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మంగళవారం ఉదయం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. కోలుకోలక ఆంజనేయులు మృతి చెందాడు. ఘటనపై రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం తరువాత మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురానున్నట్లు బంధువులు తెలిపారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



విజేత వృషభాల యజమానికి బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా పట్టణంలో నిర్వహించిన వైఎస్సార్ అంతర్రాష్ట్ర స్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శనలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో హోరాహోరీగా జరిగిన పోటీల్లో సీనియర్ విభాగంలో డోన్‌కు చెందిన వృషభాలు విజేతగా నిలవడంతో యజమాని మన్నె సుబ్బారెడ్డికి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి రూ.లక్ష నగదు బహుమతిని అందజేశారు. తర్వాతి స్థానాల్లో నిలిచిన గుంటూరు జిల్లా కుంచనపల్లి పీఆర్ మెమోరియల్ పులగం త్రిషజ్ఞ రెడ్డి, జస్విత్ రెడ్డి, కోడుమూరు మండలం వర్కూరు దొడ్డికాటి తిరుమలేష్, నంద్యాల జిల్లా కొత్తకోట వృషభాల యజమానికి వరుసగా రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు నగదు బహుమతులనందించారు.

- అలాగే సబ్‌జూనియర్ విభాగంలో విజేత వృషభాల యజమాని నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బొరెడ్డి కేశవరెడ్డికి రూ.60 వేలు, తర్వాతి స్థానాల్లో నిలిచిన జిల్లెల్ల వృషభాల యజమాని గొటిక నాగిరెడ్డికి రూ.50 వేలు, గోనెగండ్ల మండలం చిన్ననెలటూరు గాజుల కుమార స్వామికి రూ.40 వేలు, వనపర్తి జిల్లా పెద్దమారురు గోసాయి రమేష్‌నాయుడుకు రూ.30 వేలు, అనంతపురం జిల్లా సోమలదొడ్డి వీరా శేషారెడ్డికి రూ.20 వేలను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

లాభసాటి సాగును అనుసరించాలి

ఆలూరు: బోరుబావులు, నీటి వసతి కలిగిన రైతులు లాభసాటి వ్యవసాయంపై దృష్టిపెట్టాలని, ఆకుకూరలు, కూరగాయాలు, పండ్ల తోటల సాగు చేపట్టాలని ఏపీడీ పక్కీరప్ప సూచించారు. ఆయన మంగళవారం అరికెర గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించేలా డ్రిప్ వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఉపాధి పథకం ఏపీఓ, టీఏ, ఎఫ్ఏ, ఈసీలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



చెరుకులపాడు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని చెరుకులపాడు, రామళ్లకోట, పుల్లగుమ్మి, బుక్కాపురం, సర్పరాజాపురం, బాలాపురం, నర్సాపురం, పుల్లగుమ్మి, గోవర్ధనగిరి, బోగోలు గ్రామాలలోని హైపర్ సెన్సిటివ్ (సున్నితమైన) పోలింగ్ స్టేషన్లను మంగళవారం పత్తికొండ నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఆర్‌డీఓ) రామలక్ష్మి తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లలోని బూత్‌లలో సౌకర్యాలు పరిశీలించారు. ర్యాంప్, నీరు, విద్యుత్, ఇతరత్రా సౌకర్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు కోరిన కొసనాపల్లె, ఎల్ కొట్టాలలోని పాఠశాలలను సైతం పరిశీలించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఓటర్లకు, పోలింగ్‌కు అన్ని రకాల సౌకర్యాల కల్పన చేపడుతున్నట్లు ఈఆర్ఓ తెలిపారు. తహసీల్దార్ శివరాముడు, సర్వేయర్ హేమంత్ రెడ్డి, ఆర్ఐ మస్తాన్, బీఎల్ఓలు వెంట ఉన్నారు.